క్లుప్తంగా

ముత్యమాంబ దీక్ష విరమణ



కె.జె.పురంలో ముత్యమాంబ మాలాధారణ భక్తుల ఊరేగింపు

మాడుగుల రూరల్: కె.జె.పురంలో ముత్యమాంబ మాలాధారణ భక్తులు శనివారం దీక్ష విరమణ చేశారు. ఈ నెల 22న భక్తులు మాలాధారణ చేశారు. తొమ్మిది రోజుల పాటు ప్రతి రోజు ఉదయం,సాయంత్రం పూజలు, అభిషేకాలు, నిర్వహించారు. శనివారం ఉదయం గ్రామంలో ఊరేగింపు నిర్వహించి, అనంతరం ముత్యమాంబ ఆలయం వద్ద దీక్ష విరమించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు ఆదారి బాబ్జి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా ధనుర్మాసోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో కల్యాణ వేంకటేశ్వర స్వామి

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నిర్వహిస్తున్నారు. వచ్చేనెల భోగి పండగను పురస్కరించుకుని స్వామి వారి తిరువీధి ఉత్సవం, గోదాదేవి కల్యాణం నిర్వహించనున్నట్టు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు రాపేట రామకొండలరావు తెలిపారు. మాడుగుల వేంకటేశ్వర స్వామి ఆలయంలో కూడా ధనుర్మాసోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రాజు

రావికమతం: ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎంపీపీ పైల రాజు అన్నారు. ప్రభుత్వం సరఫరా చేసిన ట్యాబ్‌లను రావికమతం హైస్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులకు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి విద్యారంగం అభివృద్ధికి కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ముక్కా మహలక్ష్మినాయుడు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు,మాజీ జెడ్పీటీసీ అశిరి వాసుగోవిందరావు, హైస్కూల్ కమిటీ చైర్మన్ కొశిరెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం తరలింపు వాహనాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ కొండలరావు

మాడుగుల: స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక మార్కెట్ కమిటీ చైర్మన్ శానాపతి కొండలరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఈ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. స్థానిక మండల వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు, స్థానిక సర్పంచ్ యడ్ల కళావతి, రైతు భరోసా కేంద్రం చైర్మన్ కుక్కర శ్రీధర్, వీఏఏలు బి.జ్యోతి, టి.ఎం.వి. రేణుక తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో ఫుల్ జోష్

- సామాజిక బస్సు యాత్రకు వేలాదిగా తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గీతాలు ఆలపిస్తున్న రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలు ఉష



మేడపైకి ఎక్కి నాయకులకు అభివాదం చేస్తున్న ప్రజలు



వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



బస్సుయాత్రలో పాల్గొన్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యేలు పెట్ల ఉమాశంకర గణేష్, గొల్ల బాబూరావు, భాగ్యలక్ష్మి



సభలో సీఎం ఫొటో ఉన్న ప్లకార్డు చూపుతున్న అభిమానులు

మాకవరపాలెం/నాతవరం: నర్సీపట్నంలో శనివారం జరిగిన సామాజిక సాధికార బస్సుయాత్ర వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల్లో జోష్ నింపింది. ఉరకలేసిన ఉత్సాహంతో అన్ని గ్రామాల నుంచి భారీ ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సంక్షేమ పథకాల లబ్ధిదారులు తరలివెళ్లారు. ద్విచక్రవాహనాలు, కారులు, బస్సులు ఇలా తమకు అందుబాటులో ఉన్న వాహనాల్లో వారు సభ ప్రాంగణానికి చేరుకున్నారు. అంతకు ముందు భీమబోయిన పాలెం నుంచి సభా ప్రాంగణం వరకు బస్సు యాత్రతో పాటు సాగిన బైక్ ర్యాలీలో భారీగా యువకులు పాల్గొన్నారు. మాకవరపాలెం మండలంలో ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, తూర్పుకాపు సంఘ మండల అధ్యక్షుడు గొంతిన హరిబాబు, సచివాలయాల మండల కన్వీనర్ చిటికెల రమణ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బొడ్డు గోవింద, డీసీసీబీ మాజీ డైరెక్టర్ పెట్ల భద్రాచలం, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు మూకల బాలకృష్ణతోపాటు పలు పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యుల ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు వేలాదిగా తరలివెళ్లారు. ఆటోలతోపాటు ద్విచక్రవాహనాలపై ర్యాలీగా వెళ్లడంతో రోడ్లన్నీ వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కిక్కిరిసి పోయాయి. నాతవరం మండలం నుంచి రాజకీయాలకు అతీతంగా ప్రజలు వెళ్లారు. సంక్షేమ పథకాలు అందుకుంటున్న లబ్ధిదారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివెళ్లారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీమెటీరియల్‌తో విద్యార్థులు, ఉపాధ్యాయులు నారాయణరావు, బాబూరావు

మూడు హైస్కూళ్ల విద్యార్థులకు అందజేత

కె.కోటపాడు : పదవ తరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలని గొండుపాలెం హైస్కూల్ ఉపాధ్యాయుడు ఎల్.వి. నారాయణరావు అన్నారు. సిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గొండుపాలెం హైస్కూల్‌లో టెన్త్ విద్యార్థులకు శనివారం స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని ప్రతి విద్యార్థి మంచిమార్కులతో ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. గొండుపాలెం హైస్కూల్ విద్యార్థులతో పాటు ఎ.కోడూరు, మేడిచర్ల హైస్కూళ్లకు చెందిన విద్యార్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సూర్రెడ్డి బాబూరావు, గొండుపాలెం సర్పంచ్ బండారు కనక మల్లీశ్వరి, ఎంపీటీసీ వంటాకు నారాయణమ్మ పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం

మాకవరపాలెం: మండలంలోని తామరం అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ఓటరు నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఈ సదస్సులో నర్సీపట్నం ఆర్డీవో జయరాం మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారంతా ఓటు హక్కు కోసం దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అర్హత ఉన్న వారంతా ఓటు హక్కును నమోదు చేసుకుని, ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఓటును వినియోగించుకోవాలని తెలిపారు. తహసీల్దార్ ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ మోహనరావు తదితరులు మాట్లాడారు.

అయోధ్య రాముని అక్షింతల పంపిణీకి ఏర్పాట్లు



కె.జె.పురం మోదకొండమ్మ ఆలయంలో అక్షింతలను సిద్ధం చేస్తున్న భక్తులు



రోలుగుంటలో అక్షింతలను ప్యాక్ చేస్తున్న చిన్నారులు

మాడుగుల రూరల్: అయోధ్య నుంచి వచ్చి స్వామి వారి అక్షింతలను కె.జె.పురం గ్రామంలో పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కె.జె.పురం మోదకొండమ్మ ఆలయంలో ఈ అక్షింతలను చిన్న చిన్న ప్యాకెట్లలో శనివారం సిద్ధం చేశారు. వచ్చేనెల 3వ తేదీన వీటిని ఇంటింటికీ పంపిణీ చేయనున్నట్టు విశ్వహిందూ పరిషత్ మండల ప్రముఖ్ రాపేట రామకొండలరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యవాహ్ ఆదారి శ్రీనివాసరావు మాస్టర్, స్థానిక ఎంపీటీసీ సభ్యులు భీశెట్టి శ్రీనివాసరావు, ఆదారి కన్నారావు తదితర్లు పాల్గొన్నారు.

రోలుగుంట చేరిన అయోధ్య అక్షింతలు

రోలుగుంట: అయోధ్య రామతీర్థ ట్రస్ట్ నుంచి మండలానికి అక్షింతలు, కరపత్రాలు వచ్చాయి. వీటిని వచ్చే నెల 1 నుంచి 3 వ తేదీ వరకూ అన్ని గ్రామాల్లో ఇంటింటికీ పంపిణీ చేస్తారు.

దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

దేవరాపల్లి ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజేశ్వరి

దేవరాపల్లి: దళితుల సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి అన్నారు. స్థానిక అంబేడ్కర్ కాలనీలో పౌర హక్కుల దినోత్సవాన్ని స్థానిక తహసీల్దార్ ఎం.లక్ష్మి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎస్సీ,ఎస్టీ చట్టాలు, పౌరహక్కులపై అవగాహన కలిగిఉండాలన్నారు. అనంతరం తహసీల్దార్ లక్ష్మి దళితుల సమస్యలను అడిగి తెలుసుకుని, పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సమగ్ర భూ రీసర్వేలో భాగంగా అర్హులైన దళితులు అందరికీ సాగు హక్కు పట్టాలు మంజూరు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యులు కె.వి.రమణ, కాటపల్లి అప్పారావు, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, సోషల్ వెల్ఫేర్ ప్రతినిధి డి.రమేష్ తదితర్లు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల వన సమారాధనకు ఆహ్వానం

అనకాపల్లి : జీవీఎంసీ గవరపాలెం చిన్నహైస్కూల్‌కు చెందిన 1972–75 బ్యాచ్ పూర్వ విద్యార్థుల వన సమారాధన ఆదివారం ఉదయం 9 నుంచి 5 వరకూ జరుగుతుందని సంక్షేమ సంఘం అధ్యక్షుడు బల్లా నాగభూషణం, కార్యదర్శి దాడి శివరామకృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కొప్పాక గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్ ఎదురుగా ఉన్న జెమిని డ్రింక్స్ ఆవరణలో జరిగే ఈ కార్యక్రమానికి పైన పేర్కొన్న సంవత్సరాల్లో చదివిన పూర్వ విద్యార్థులు హాజరు కావాలని కోరారు.

ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

అనకాపల్లి : అనకాపల్లి ఏరియా ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ వనభోజన కార్యక్రమం ఆదివారం మండలంలో సత్యనారాయణపురం మామిడితోటలో ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కనిశెట్ల కోటేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అసోసియేషన్ సభ్యులు కుటుంబ సమేతంగా హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

ముమ్మరంగా వరికోతలు

రాంబిల్లి : మండలంలో వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. మిచాంగ్ తుపాను సమయంలో దెబ్బతినకుండా ఉన్న వరిపంటను రైతులు కోసి, ఆరబెట్టి కుప్పలు వేస్తున్నారు. ముమ్మర పనుల నేపథ్యంలో కూలీలకు డిమాండ్ ఏర్పడింది. దీంతో రైతులు ఇతర మండలాల నుంచి కూలీలను ఆటోలు, ఇతర వాహనాల్లో తీసుకువచ్చి పనులు చేయిస్తున్నారు. మరో పది రోజుల్లో ఈ పనులు పూర్తి అయ్యే అవకాశాలున్నాయి.

రసవత్తరంగా 'ఆడుదాం ఆంధ్రా'

- ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులు



చోడవరం ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్‌లో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు



చోడవరంలో పోటీలను పరిశీలిస్తున్న మండల స్థాయి అధికారులు



గొండుపాలెంలో కబడ్డీ ఆడుతున్న యువకులు



కె.కోటపాడులో క్రికెట్ పోటీల ప్రారంభంలో టాస్ వేస్తున్న పీడీ రోహిణి



కె.జె.పురంలో ఖోఖో ఆడుతున్న విద్యార్థులు



దేవరాపల్లిలో షటిల్ ఆడుతున్న క్రీడాకారులు

చోడవరం/కె.కోటపాడు/మాడుగులరూరల్/రోలుగుంట/నాతవరం/దేవరాపల్లి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా పోటీలు అన్ని సచివాలయాల పరిధిలో రసవత్తరంగా జరుగుతున్నాయి. క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొంటూ తమ ప్రతిభను చాటుతున్నారు.పెద్ద సంఖ్యలో గ్రామస్తులు వీటిని తిలకిస్తున్నారు.

- చోడవరం మండలంలోని 28 సచివాలయాల పరిధిలో శనివారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 48 జట్లు పాల్గొన్నాయి. చోడవరం, జన్నవరం, లక్ష్మీపురం, గౌరీపట్నం, ఖండిపల్లి, పీఎస్‌పేట, గవరవరం, లక్కవరం, జుత్తాడ, గోవాడ, ముద్దుర్తి, దుడ్డుపాలెం తదితర ప్రాంతాల్లో ఈ పోటీలు నిర్వహించారు. చోడవరంలో జరిగిన పోటీలను ఎంపీడీవో శ్యామ్‌సుందర్, తహసీల్దార్ తిరుమలబాబు, ఈఆర్‌వోడీ చైతన్య తదితరులు పరిశీలించారు.
- కె.కోటపాడు మండలంలోని గొండుపాలెం, కె.కోటపాడు, చౌడువాడ గ్రామాల్లో శనివారం నిర్వహించిన కబడ్డీ, క్రికెట్ పోటీలను పీడీలు రోహిణి, లక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు ఎస్.రామునాయుడు, ప్రసాద్ పర్యవేక్షించారు.
- మాడుగుల మండలంలోని కె.జె.పురం 1, 2 సచివాలయాల పరిధిలో ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించారు. స్థానిక వ్యాయామ ఉపాధ్యాయుడు కె.ప్రసాదు, పంచాయతీ కార్యదర్శి పి.శివ పాల్గొన్నారు. వీరవల్లి, ఎం.కోటపాడు, జె.డి.పేట, మాడుగుల తదితర గ్రామాల్లో పోటీలు జరిగాయి. ఈ పోటీలను స్థానిక ఎంపీడీవో మీనాకుమారి తదితరులు పరిశీలించారు.
- రోలుగుంట మండలంలో ఆడుదాం ఆంధ్రా పోటీలు ముగిశాయి. 16 సచివాలయాల పరిధిలో ఈ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ కె.నూకరాజు విలేకరులతో మాట్లాడుతూ పోటీల్లో ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేసి త్వరలో జరిగే మండల స్థాయి పోటీలకు పంపనున్నట్టు తెలిపారు.
- నాతవరం మండలంలో 17 సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రా పోటీలు పోటాపోటీగా జరుగుతున్నాయి. శనివారం అన్ని గ్రామాల్లో పోటీలు నిర్వహించారు.
- దేవరాపల్లి మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో యువతుల ఖోఖో, పురుషుల కబడ్డీ, వాలీవాల్, షటిల్ బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు హోరా హోరీగా సాగుతున్నాయి. ఈ క్రీడా పోటీలను విద్యార్థులతో పాటు గ్రామస్తులు సైతం అధిక సంఖ్య తరలివచ్చి ఆసక్తిగా తిలకిస్తున్నారు.



దేవరాపల్లిలో ఖోఖో ఆడుతున్న యువతులు



కె.జె.పురం హైస్కూలు ప్రాంగణంలో కబడ్డీ ఆడుతున్న మహిళలు



రోలుగుంట మైదానంలో ఉత్సాహంగా కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



నాతవరంలో వాలీబాల్ ఆడుతున్న బాలికలు

అగ్నిగుండం తొక్కిన భక్తులు



అగ్ని గుండం తొక్కుతున్న భక్తులు

అచ్యుతాపురం: మండలంలోని ఎర్రవరంలో మార్గశిర మాస ముగింపు ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి భక్తులు అగ్ని గుండం తొక్కారు. అర్చకులు కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కార్తీక మాసంలో 60 మంది భవానీ మాలలు ధరించారు. 41 రోజుల దీక్షలు పూర్తి చేసిన సందర్భంగా అమ్మవారి అనుపు మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి గంప శూలం, బుగ్గ శూలం ధరించిన భవానీ మాలధారణ భక్తులు అగ్నిగుండం తొక్కారు. సర్పంచ్ గంగిరెడ్డి లక్ష్మీరాము, అగ్గాల భాస్కర్‌రావు, హనుమంతరావు, కనకారావు పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న తిరువీధి సేవలు



ఆంజనేయవాహనంపై స్వామివారిని తిరువీధి సేవలకు తీసుకెళ్తున్న దృశ్యం



పల్లకిలో గోదాదేవి అమ్మవారు

నక్కపల్లి : ధనుర్మాస అధ్యయనోత్సవాల్లో భాగంగా ఉపమాకలో వేంకటేశ్వర స్వామివారి తిరువీధి సేవలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శనివారం స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, అర్చనలు, నిత్యకార్యక్రమాలు నిర్వహించారు. కొండదిగువన క్షేత్రపాలకుడు వేణుగోపాల స్వామికి, గోదాదేవి అమ్మవారికి, స్వామివారి ఉత్సవ మూర్తులకు, ఇతర ఉపాలయాల్లో అర్చక బృందం నిత్యార్చనలు పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారిని ఆంజనేయ వాహనంపై, గోదాదేవి అమ్మవారిని పల్లకిలో ఉంచి తిరువీధి సేవ నిర్వహించారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో తిరుప్పావైలోని ఎల్లే ఇళంకిళియే ఇన్నం ఉరంగదియో 15వ పాశురాన్ని ప్రత్యేక నీరాజనాలతో సమర్పించారు. రాపత్తు అధ్యయనోత్సవాల్లో భాగంగా సాయంత్రం పుణ్యకోటి వాహనంపై స్వామివారి తిరువీధి సేవ జరిగింది. అనంతరం నాలాయిర దివ్య ప్రబంధ సేవాకాలం, విశేష ప్రసాద నివేదనలు తీర్థ గోష్టి ప్రసాద వినియోగం జరిగింది. ఈ కార్యక్రమాల్లో ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, అర్చక స్వాములు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి వెంకట శేషాచార్యులు, భాగవతం గోపాలాచార్యులు, శ్రీనివాసాచార్యులు , రాజగోపాలాచార్యులు పాల్గొన్నారు.

ఆలయానికి హార్మోనియం వితరణ



ఆలయ కమిటీ సభ్యులకు హార్మోనియం అందజేస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లి : అన్ని దానాల కంటే అన్న దానం గొప్పదని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక గవరపాలెం సంతోషిమాత అమ్మవారి ఆలయ 47వ వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. తన సొంత నిధులతో అమ్మవారి ఆలయానికి హార్మోనియం అందజేసిన రత్నాకర్, అచ్యుత దంపతులు మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య, వైఎస్సార్‌సీపీ నాయకులు పీలా రాంబాబు, విల్లూరి ప్రసాద్, కాండ్రేగుల వెంకట సాంబశివరావు, పెతకంశెట్టి గోపి, కొణతాల గోవింద, మల్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.